క్లుప్తంగా

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



నందిగామ: ఏకాదశి పర్వదినంతోపాటు సోమవారం కూడా కలిసిరావడంతో మండలంలోని ఆయా శివాలయాలలో భక్తులు విశేష పూజలు చేశారు. నందిగామలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కూడలి సంగమేశ్వరస్వామి, పట్టణ శివారు మున్నేటి తీరం వద్ద గల విజ్ఞాన నందీశ్వరస్వామి, పల్లగిరి గుట్టపై గల స్వయంభు శివలింగం వద్ద భక్తులు అభిషేకాలతో పాటు పూజలు చేశారు.

పిడుగుపడి ధ్వజస్తంభం గోడ ధ్వంసం



అనుమంచిపల్లి(జగ్గయ్యపేట):గ్రామంలో సోమవారం రాత్రి గాలిదుమ్ము, ఉరుములతో కూడిన భారీవర్షం కురిసింది. సుమారు రెండు గంటలపాటు కురిసిన వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రామాలయంలోని ధ్వజస్తంభంపై భారీ శబ్దంతో పిడుగు పడటంతో ధ్వజస్తంభం స్వల్పంగా ధ్వంసమైంది.

ఘనంగా చర్చి వార్షికోత్సవ వేడుకలు



గండేపల్లి(కంచికచర్ల): ఏసుప్రభువును ప్రతి ఒక్కరూ గుర్తెరిగి ఆయన ఆజ్ఞలను పాటిస్తే మంచి మేలులు జరుగుతాయని నందిగామ సీఎస్ఐ డయోసిస్ డీనరీ చైర్మన్ రెవరెండ్ చంద్రకుమార్ పేర్కొన్నారు. మండలంలోని గండేపల్లి సీఎస్ఐ దేవాలయ 5వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా క్రీస్తు విశ్వాసులు జీసస్ సన్నుతిగీతాలు ఆలపించారు. ఈసందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ అందరూ క్రీస్తు అడుగుజాడల్లో నడుచుకోవాలన్నారు. సమాజంలో జీవించినంతకాలం ఒకరినొకరు ప్రేమానురాగాలు కలిగి ఉండాలన్నారు. దయ, జాలి, క్షమాగుణం మంచి లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. తోటివారికి ఏ హాని తలపెట్టవదని బైబిల్ బోధిస్తోందన్నారు. క్రీస్తు పలికిన పది ఆజ్ఞలను విశ్వాసులు, భక్తులు పాటించాలని సూచించారు. అనంతరం విశ్వాసులు, భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రేమవిందు చేశారు. కార్యక్రమంలో సంఘ కాపరి ఎం.జాన్ కోటేశ్వరరావు, పాస్టర్లు బి.కిషోర్‌బాబు, బి.తిమోతీ, సర్పంచి బొక్కా రవికుమార్, ఆలయ కమిటీ సభ్యులు మార్కపూడి లాజరు, స్త్రీలమైత్రీ సభ్యులు, విశ్వాసులు పాల్గొన్నారు.

మొండి బకాయిల వసూలుకు పటిష్ట చర్యలు



కృష్ణలంక(విజయవాడ తూర్పు): సహకార స్ఫూర్తితో ఉత్తమ సేవలు అందిస్తూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొండి బకాయిల వసూలుకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో సోమవారం విజయవాడ, హైదరాబాద్, తిరుపతి జోన్ల పరిధిలోని శాఖల సిబ్బందికి సహకార వ్యవస్థ ప్రాధాన్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాఘవేంద్రరావు మాట్లాడుతూ సహకార జీవనం లేకుండా మానవ మనుగడ లేదని నమ్ముతున్న పాలకవర్గం నిర్ణయాలను సిబ్బంది శ్రద్ధతో అమలు చేయాలన్నారు. బ్యాంక్ అభివృద్ధిలో భాగంగా పాలకవర్గం తీసు కున్న నిర్ణయాలను సమర్థంగా అమలు చేయడంతో పాటు అత్యధిక నిధుల సాధనకు, నిరర్థక ఆస్తుల తగ్గింపునకు కృషి చేసిన సిబ్బందిని రాఘవేంద్రరావు అభినందించారు. ఈ సందర్భంగా మొండి బకాయిల వసూలు చేపట్టిన సిబ్బందికి రూ.కోటి అవార్డు ప్రకటించారు. ఈ సదస్సులో బ్యాంకు మార్గదర్శకుడు మానం ఆంజనేయులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.రామకృష్ణారావు, డైరెక్టర్లు జేవీ సత్యనారాయణ మూర్తి, జనార్దన్, చిన్నం కోటేశ్వరరావు, పి.రమణరావు, పి.నారాయణ స్వామి, సీఈవో నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



పేటలో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



నందిగామ జామామసీదులో ముస్లింలతో కలిసి నమాజ్ చేస్తున్న మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

జగ్గయ్యపేట అర్బన్ : బక్రీద్ పర్వదిన వేడుకలను జగ్గయ్యపేట పట్టణంలోని ముస్లిం సోదరులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. బలుసుపాడు రోడ్‌లోని ఈద్గా, పట్టణంలోని జామియా మసీదు, చెరువుబజారులోని క్యూబా మసీదు, మిట్టగూడెంలోని నూర్ మసీదు, కాయితాల బజారులోని రజా మసీదు, నాగమయ్య బజారులోని కౌసర్ మసీదు, కాకానినగర్‌లోని బిలాల్ మసీదు, నాయీబ్రాహ్మణ బజారులోని రుకియా మసీదు, తొర్రగుంటపాలెంలోని మదీనా మసీదులలో ఉదయం 9 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని పండుగ శుభాకంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా వద్ద ముఫ్తి మహ్మద్‌ఆలీ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించి బక్రీద్ సందేశాన్ని ఇచ్చారు. త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ పర్వదినం సందర్భంగా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండి సోదరభావంతో మెలగాలని సూచించారు. అల్లా కోసం ఇబ్రహీం త్యాగాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలంటూ అల్లాను ప్రార్థిస్తూ నమాజు చేశారు.

ఎమ్మెల్యే తాతయ్య ప్రార్థనలు..

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని బలుసుపాడు రోడ్‌లోని ఈద్గా వద్ద జరిగిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

నందిగామ టౌన్: బక్రీద్ పండుగ త్యాగనిరతికి నిదర్శనమని నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని జామా మసీదు వద్ద సోమవారం ఆయన ముస్లింలతో కలిసి ప్రత్యేక నమాజులు చేశారు. అనంతరం ముస్లింలను ఆత్మీయ ఆలింగనం చేసుకుని బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ త్యాగం, సహనం బక్రీద్ పండుగ ఇచ్చే సందేశమన్నారు. వ్యక్తిగత స్వార్థాన్ని వీడి త్యాగాలకు సిద్ధపడినప్పుడే సమాజ హితం సాధ్యమవుతుందని తెలిపారు. భక్తిభావం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు చిహ్నంగా నిలిచే బక్రీద్ పండుగ ప్రతిఒక్కరి జీవితాలలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, ముతావలి మహ్మద్ ఖాజా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, నాయకులు షేక్ మున్నా, జాఫర్, పాకాలపాటి కిరణ్, ఓర్సు జ్వాలా, పెద్దసంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: మండలంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలను జరుపుకున్నారు. మండలంలోని గౌరవరం, ముక్త్యాల, షేర్‌మహ్మద్‌పేట, అనుమంచిపల్లి, చిల్లకల్లు గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దానధర్మాలు చేశారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు..

నందిగామ : త్యాగాలకు గుర్తుగా జరుపుకునే బక్రీద్ పండుగను నందిగామ డివిజన్ వ్యాప్తంగా ముస్లిం సోదరులు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నందిగామలోని మసీదులు, ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మసీదుల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా మసీదుల్లో మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. ప్రతిఒక్కరూ దానధర్మాలు చేశారు. నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : బక్రీద్ పండుగను వత్సవాయి మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకుమజామునే దర్గాలకు వెళ్లి నమాజులు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పేదలకు దానం చేశారు. మతపెద్దలు మాట్లాడుతూ శక్తి కొలదీ ప్రతిఒక్కరూ పేదలను ఆదుకోవాలని సందేశమిచ్చారు. దబ్బాకుపల్లి, వత్సవాయి, భీమవరం, తాళ్లూరు, మక్కపేట, మంగొల్లు, చిట్టేల గ్రామాల్లో బక్రీద్‌ను వైభవంగా జరుపుకున్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : మనుషుల్లో త్యాగనిరతిని వ్యాపించడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశ్యమని ముస్లిం మత గురువులు నిఖార్ మెయిదీన్, నూరుల్లామియాలు పేర్కొన్నారు. కంచికచర్ల, పెండ్యాల ఈద్గా, మసీదులతోపాటు మండలంలోని పరిటాల, చెవిటికల్లు, గండేపల్లి, గనిఆత్కూరు, మోగులూరు, తదితర గ్రామాల్లో సోమవారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక నమాజ్ చేశారు. ఈసందర్భంగా మతపెద్దలు మాట్లాడుతూ అన్ని గుణాల్లో కన్నా దానగుణం గొప్పదన్నారు. పేదవారికి దానం చేస్తే ఆ అల్లా ఆశీర్వదిస్తారని సూచించారు. ఖుర్బానీ ద్వారా పేదలకు ఆహారం అందజేయడం శుభపరిణామన్నారు. హజ్రత్ ఇబ్రహీం త్యాగనిరతిని స్మరించుకోవాలన్నారు. ముస్లింలు త్యాగనిరతితోపాటు సమైక్యత, సమానత్వం, సోదరభావం కలిగి ఉండాలని సూచించారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: బక్రీద్ పర్వదినాన్ని మండలంలోని ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక పురాతనమైన జుమ్మామసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయాగ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: బక్రీద్ పండుగ మత సామరస్యానికి ప్రతీకని మతగురువు రాయల్‌రాజా పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరులో బక్రీద్ పండుగను సోమవారం ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వమతాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. తమకున్నంతలో పేదలకు సహాయపడితే అల్లా ఆశీస్సులు మెండుగా ఉంటాయని వివరించారు. పండుగ సందర్భంగా చిన్నాపెద్దా తేడా లేకుండా ముస్లింలు పెద్దసంఖ్యలో నమాజ్‌లో పాల్గొన్నారు. మసీద్ ప్రెసిడెంట్ హుసేన్, గ్రామ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.



పేటలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



నందిగామ శివారు అశోక్‌నగర్ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పెనుగంచిప్రోలులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పెండ్యాలలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



జుజ్జూరులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో సోమవారం శ్రీభగవద్రామానుజ గోష్టి ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా స్థానిక పాలేటి తీరాన ఉన్న పురాతన దేవాలయమైన శ్రీభూగోదా సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామివార్లకు తొలుత జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), ఆయన తనయుడు శ్రీరాం సిద్ధూ ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం నిరుపేదలు, వృద్ధులకు ఎమ్మెల్యే తాతయ్య చేతుల మీదుగా దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భగవద్రామానుజ గోష్టి ప్రతినిధులు ఆకుల స్వాతికుమార్, విజయ దంపతులు, వార్డు కౌన్సిలర్ గొట్టి నాగరాజు, చెన్నకేశవస్వామి ఆలయ భక్తబృందం, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆదిరెడ్డికి అశ్రునయనాలతో వీడ్కోలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): యాచన చేసి సంపాదించిన ప్రతి పైసాను దైవ కార్యాలకు వినియోగించిన కలియుగ దానకర్ణుడు యడ్ల యాదిరెడ్డి స్వామి అని ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరం గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి కొనియాడారు. స్థానిక సత్యనారాయణపురం అంతిమయాత్ర భవనం వద్ద సోమవారం యాచకుడు, దాత యడ్ల ఆదిరెడ్డి స్వామి అంతిమ యాత్ర ఘనంగా జరిగింది. కార్యక్రమంలో గౌతంరెడ్డి పాల్గొని ఆదిరెడ్డి సేవలను కొనియాడారు. కోట్లాది రూపాయలు ఉన్న వారు సైతం చేయలేని సేవలను ఆదిరెడ్డి అందించటం అభినందనీయం అన్నారు. అనంతరం పలువురు ఆదిరెడ్డి భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిర కమిటీ అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి పాల్గొన్నారు.

ముఖం చాటేసిన రుతుపవనాలు

వర్షాలు కురవక రైతుల్లో ఆందోళన

కంచికచర్ల : ఏరువాక సాగుకు రైతులు సిద్ధమయ్యారు. కాని చల్లని కబురు మాత్రం ఇంకా ఊరిస్తూనే ఉంది. రుతుపవనాల రాకలో తీవ్రజాప్యం ఏర్పడటంతో వర్షాలు కురవక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలువురు రైతులు తమ పొలాల్లో సేంద్రీయ ఎరువులు వేసి దుక్కులు దున్ని సాగుకు సన్నద్ధమై, వర్షాల కోసం ఆకాశం వెపు ఆశగా ఎదురుచూస్తున్నారు. చినుకు పడితే వ్యవసాయ పంటల సాగుకు సన్నాహాలు చేస్తుకుంటున్నారు.



గండేపల్లిలో సేంద్రీయ ఎరువులు వేసి దుక్కి దున్నిన పొలం

ముఖం చాటేసిన రుతుపవనాలు..

గతేడాది రుతు పవనాలు సకాలంలో రావడంతో జూన్ మాసంలో రైతులు పంటలు సాగు చేపట్టారు. ఈసారి జూన్ మూడోవారం ప్రారంభమైనా ఎండలు తీవ్రత తగ్గటం లేదు. వర్షాల కోసం మరికొన్ని రోజులు వేచి చూడాల్సిన దుస్థితి నెలకొనడంతో రుతు పవనాలు ముఖం చాటేసాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలతో ఈ వేసవిలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. వేసవి ముగుస్తున్నా వర్షం జాడ కనిపించటంలేదు. వానలు దండిగా కురవాల్సిన ఈ సమయంలో తీవ్ర ఎండలు, వడగాల్పుల ధాటికి ప్రజలు అవస్థలుపడుతున్నారు. కనీసం చిరుజల్లులు నేలను తాకితే దుక్కి దున్నవచ్చని రైతులు భావిస్తున్నారు. ఈ ఏడాది 5 శాతం వర్షపాతం తగ్గే అవకాశం ఉందని వాతావరణశాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. గడిచిన మూడేళ్లుగా అధికంగా వర్షాలు కురిసాయి. దీంతో రైతులు పంటలు సకాలంలో సాగుచేసి మంచి దిగుబడిని సాధించారు. జూన్ మాసంలో కేరళ తీరాన్ని దాటే రుతుపవనాలు ఈ ఏడాది కనుచూపు మేరలో కనిపించకపోతుండటంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

సెప్టిక్ వ్యర్థాలతో దుర్వాసన

- వ్యర్థాలను రోడ్డు పక్కన వదులుతున్న సెప్టిక్ ట్యాంకర్ల డ్రైవర్లు
- దుర్వాసనతో ప్రజలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

వీరులపాడు: కొందరు సెప్టిక్ ట్యాంక్ నిర్వాహకుల నిర్వాకం కారణంగా ఆయా రోడ్లలో వచ్చే తీవ్ర దుర్వాసనను భరించలేక జనం ఇబ్బందిపడుతున్నారు. కంచికచర్ల పట్టణంతోపాటు కంచికచర్ల, వీరులపాడు మండలాల్లోని ఆయా గ్రామాల నుంచి సెప్టిక్‌ట్యాంకులను క్లీన్ చేసే వాహనాలు ఆయా వ్యర్థాలను తీసుకువచ్చి రహదారులకు ఇరుపక్కల పడేస్తుండటంతో దుర్వాసనను భరించలేకపోతున్నామని వాహనచోదకులు చెబుతున్నారు. సెప్టిక్ ట్యాంకుల వ్యర్థాలను మండలంలోని జగన్నాథపురం గ్రామసమీపంలో పెద్దాపురం-కంచికచర్ల ప్రధాన రహదారి పక్కన పడేస్తున్నారు. ఈరోడ్డు ఆంధ్ర-తెలంగాణ కలిపే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారికి సమీపంలోనే మేజర్ గ్రామాలుండటంతో వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసన భరించలేక వాహనదారులు, సమీపంలోని పొలాలకు వచ్చే రైతులు, కూలీలు ఇబ్బంది పడుతున్నారు.



జగన్నాథపురం సమీపంలో రోడ్డు పక్కన వదులుతున్న సెప్టిక్ వ్యర్థాలు

వ్యాధులు ప్రబలే అవకాశం..

ఇలా సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను ఎక్కడంటే అక్కడ పడేస్తుండటంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. రహదారుల పక్కన సెప్టిక్ ట్యాంకుల వ్యర్థాలను పడేయవద్దని పలుమార్లు చెప్పినప్పటికీ ఆయా ట్యాంకర్ల యజమానులు లెక్కపెట్టడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్ల పక్కన సెప్టిక్‌ట్యాంకుల వ్యర్థాలను వదిలిపెడుతున్న టాంకర్ల యజమానులు, డ్రైవర్లపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దుర్గంధం భరించలేకపోతున్నాం



ఆయా పనులపై నిత్యం దొడ్డదేవరపాడు-కంచికచర్ల రోడ్డులో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఈ క్రమంలో రహదారుల పక్కన వేస్తున్న వ్యర్థాల నుంచి వస్తున్న దుర్గంధం భరించలేక పోతున్నాం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

నాగ, దొడ్డదేవరపాడు

ఇబ్బందులు పడుతున్నాం..



రహదారి పక్కన వేస్తున్న వ్యర్థాలతో దుర్వాసన వస్తుండటంతో ముక్కుపుటాలు అదురుతున్నాయి. రోడ్డు పక్కన పడేయవద్దని పలుమార్లు కోరినా ఆయా ట్యాంకర్ల డ్రైవర్లు పట్టించుకోవడం లేదు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముంది. వారిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

పద్మారావు, జుజ్జూరు

ముగిసిన ప్రస్థాన సాధన శిక్షణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్ఫూర్తి కుటుంబం ఆధ్వర్యంలో ఠాగూర్ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ప్రస్థాన సాధన శిక్షణ ముగిసింది. సోమవారం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఠాగూర్ గ్రంథాలయంలో 9 వారాల పాటు విద్యార్థులకు ప్రస్థాన సాధన శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అమరావతి బోట్ క్లబ్ ప్రతినిధి కాకాని తరుణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం యోగ సాధన చేయాలన్నారు. అది కూడా గురువు సమక్షంలోనే చేయాలని సూచించారు. ఠాగూర్ లైబ్రేరియన్ రమాదేవి మాట్లాడుతూ గ్రంథాలయంలో నిత్యం ఏదో ఒక కార్యక్రమం జరుగుతున్నప్పటికీ స్ఫూర్తి కుటుంబం నిర్వహించిన ఆసన, ప్రాణాయామ-ధ్యానం కార్యక్రమాలు మంచి ప్రభావాన్ని చూపాయన్నారు. గురువు ప్రభాకర్ మాట్లాడుతూ సాధన ద్వారా మానసిక ఒత్తిడులు తగ్గిపోతాయన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెడతారన్నారు. స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ప్రతినిధులు కాకాని తరుణ్‌కు జ్ఞాపికను అందజేసి శాలువాతో సత్కరించారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి కుటుంబ సభ్యులు మాధవి, కాదంబరి, జ్యోతి, గిరిజ, స్ఫూర్తి కుటుంబం ట్రస్టీస్ చొప్పరపు నారాయణరావు, పసుపులేటి నారాయణరావు, షణ్ముఖరావు వలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వరస్వామికి 108 కలశాలతో అభిషేకం



పెనమలూరు: పోరంకి లక్ష్మీపురం కాలనీలో వేంచేసి ఉన్న శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామివారి ఆలయంలో 20వ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయంలో 108 కలశాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో సోమవారం శ్రీ త్రిదండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో పంచామృత స్నపన, 108 కలశాలతో అష్టోత్తర శత కలశ స్నపన పూజలు చేశారు. భక్తులను ఉద్దేశించి శ్రీ త్రిదిండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి ప్రసంగించారు. అనంతరం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. శ్రీవారికి రాయభార ఉత్సవం చేశారు. కాగా మంగళవారం స్వామివారికి శ్రీ త్రిదిండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో తిరుక్కల్యాణ మహోత్సవం రాత్రి ఏడు గంటలకు నిర్వహించనున్నారు. ఉదయం సువర్ణ పుష్పార్చన చేస్తారు. భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని ఆలయ అభివృద్ధి కమిటీ కోరింది.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఓ వివాహితతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చిల్లకల్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు...చిల్లకల్లుకు చెందిన పాపబత్తిన జయపాల్, గ్రామంలో ఫౌండేషన్ ద్వారా మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ తరగతులు నిర్వహిస్తుంటారు. ఈ ఫౌండేషన్‌లో శిక్షకురాలిగా పనిచేస్తున్న జగ్గయ్యపేటకు చెందిన ఓ వివాహితతో సోమవారం మధ్యాహ్నం జయపాల్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె తన కుటుంబసభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన..

మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న జయపాల్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ కుటుంబసభ్యులు, మహిళా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చిల్లకల్లు పోలీసు స్టేషన్ ఎదుట వారు సోమవారం రాత్రి ఆందోళనకు దిగారు. కుట్టుశిక్షణకు వచ్చే పలువురు మహిళలతోనూ జయపాల్ అసభ్యకరంగా ప్రవర్తిస్తుంటాడని, అతనిపై కేసులు ఉన్నాయని పోలీసులు పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన విషయం తెలుసుకున్న సీఐ జానకీరామ్ ఆందోళనకారులతో మాట్లాడారు. విచారణ చేసి నిందితుడిపై చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చి వారిచే ఆందోళనను విరమింపజేశారు.



మహిళా సంఘం నాయకులతో మాట్లాడుతున్న ఎస్ఐ సతీష్

బ్రహ్మోత్సవాలకు సన్నద్ధం

- శ్రీనివాసుని సన్నిధిలో 21 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- 23న స్వామి వారి కల్యాణోత్సవం
- 5 రోజుల పాటు ఉత్సవాల నిర్వహణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. 21వ తేదీన ప్రారంభమై 5 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను దేవస్థాన కమిటీ చేస్తోంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే హోమాలు, యాగాల కోసం కల్యాణ మండపం ఆవరణలో ప్రత్యేకంగా ప్లాస్టిక్ కవర్‌తో షెడ్డును సిద్ధం చేశారు. గత వారం రోజులుగా తరచూ వర్షాలు కురుస్తుండటంతో ఉత్సవాలకు ఎటువంటి ఆటంకం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఇక స్వామి వారి ఆలయానికి విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు ఆలయం ఎదుట తాటాకు పందిరిని నిర్మించారు. బ్రహ్మోత్సవాలను టీటీడీ వేదవిశ్వ విద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ మణిదీప్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు, శ్రీనువాసుల గోపాల్ పర్యవేక్షణలో నిర్వహించేందుకు దేవస్థాన కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.



స్వామి వారి ఆలయం ఎదుట తాటాకు పందిరి, ఆలయానికి విద్యుత్ దీపాలతో అలంకరణ